మృత్యు చక్రాలు!

టెంపోరావ్

హోటల్ పిక్నిక్‌లో పెద్ద గొడుగుకింద కుర్చీల్లో వాళ్ళిద్దరూ కూర్చున్నారు. అతడు ఆమె వంక నవ్వుతూ చూశాడు. అతడి కళ్ళు ఆనందంతో మెరుస్తున్నాయి.

ఆమె వయస్సు యిరవై వుంటుంది. పొట్టిగా, పచ్చగా బంగారం బొమ్మలా వుంది. అమెరికన్ జార్జట్ చీర, మాచింగ్ జాకెట్ ధరించింది. కాటుక కళ్ళు. లిప్‌స్టిక్ పులిమిన పెదిమలు మెరుస్తున్నాయి.

"రమా, ఏం తెప్పించను?" అడిగాడతను బాయ్ రాగానే.

"నీ యిష్టం, మోహన్." అందామె.

మోహన్ మెనూకార్డు చూశాడు.

"జాంగ్రీ, చపాతీ, బిర్యాణీమసాలా, రవ్వాదోసా, కాఫీ!" మోహన్ ఆర్డరిచ్చాడు.

హోటల్ బాయ్ వెళ్ళిపోయాడు.

"అన్ని ఐటమ్స్ తినలేం!" అందామె.

"నాకు చాలా ఆకలిగా వుంది. గత మూడు రోజులూ నేను కాఫీమీద జీవించాను. నువ్వు కనిపించకపోవడం వలన ఆకలి చచ్చింది. ఇవాళ నా ఎదురుగా నువ్వు కూర్చుంటే విందు చేసుకోవాలనిపిస్తోంది."

"మోహన్, నీకు పిచ్చిపడ్తోంది!" అందామె కొంటెగా.

"లవ్ యీస్ ఒన్ టైప్ ఆఫ్ మాడ్‌నెస్!" అన్నాడతను నవ్వుతూ.

సమీపంలో మరో గొడుగుకింద ఒంటరిగా కూర్చున్న వ్యక్తి వాళ్ళవైపు చూస్తూ సిగరెట్ వెలిగించాడు. అతడి టేబుల్‌మీదున్న వేడి కాఫీ చలిగాలిలో చల్లారుతోంది. నలువైపులా లైట్లు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. టైము ఎనిమిది కావస్తోంది. సిగరెట్ తర్వాత సిగరెట్ వెలిగించి, పొగ పీల్చి వదులుతూ అతడు వాళ్ళవైపే చూస్తున్నాడు. కాని వాళ్ళు అతడి చూపును గుర్తించ లేదు. బాయ్ తెచ్చిన పదార్థాలు తింటూ, ఏదో ఉత్సాహంగా మాట్లాడుకుంటున్నారు వాళ్ళిద్దరూ!

ఆమె టైమ్‌చూసింది.

"అప్పుడే ఎనిమిది దాటింది!" అందామె.

"కాలానికి పనా, పాటా? తరుగుతూనే వుంటుంది!" అన్నాడతను.

టిఫిన్ ముగించి యిద్దరూ కాఫీ సేవిస్తున్నారు.

"రమా, యింకా మనం యిలా ఎంతకాలం గడుపుతాం? మీ నాన్నతో చెప్పవా?" అడిగాడతను.

"నాన్నకు నేను తప్ప సంతానంలేదు. ఏ లక్షాధికారికో యిచ్చి నన్ను పెళ్ళిచెయ్యాలని నాన్న కోరిక.

నీ జీతం యింకా వెయ్యేనా కాలేదు. అందుకని ఆలో చిస్తున్నాను," అందామె.

"నిన్ను పెళ్లాడితే నేను లక్షాధికారి నవుతానుగా!" అన్నాడు మోహన్ నవ్వుతూ.

"నాన్నకు కావలసింది తన డబ్బుతో లక్షాధికారయ్యే అల్లుడు కాదు, స్వయంగా లక్షలున్న అల్లుడు!"

"అయితే మీ నాన్న మన పెళ్ళికి ఒప్పుకో డంటావా?"

"ఒప్పిస్తాను,సరైన సమయం చూసి. మోహన్ నువ్వు తొందరపడకు!"

అతడామె కళ్ళలోకి సూటిగా చూశాడు.

"నా బాధ నీకేం తెలుసు? ఇలా నీతో కాస్సేపు కూర్చుని మాట్లాడితే నాకు తృప్తిగా లేదు. అనుక్షణం నువ్వు నాతో వుండాలి."

"నువ్వు కొంతకాలం వేచివుంటే నీ కోరిక ఫలి స్తుంది," అందామె.

అతడు బిల్లు చెల్లించాడు. ఆమె నవ్వుతూ అతడివంక చూసింది.

"ఇక నేను వెళ్ళొచ్చా? బాగా లేటైతే నాన్న అందరికీ ఫోన్ చెయ్యడం ప్రారంభిస్తాడు!"

"బీచ్ కి వెళ్దాం. ఈ చంద్రకాంతిలో, చల్లగాలిలో ఏ పడవ పక్కనో కాస్సేపు కూర్చుందాం. తర్వాత వెళ్లొచ్చు!"

"ఇంత రాత్రివేళ బీచ్ కా?"

"మనలాంటి లవర్స్ కు రాత్రే పండుగ!"

వాళ్ళు కుర్చీల్లోంచి లేచారు. గేటు దాటి రోడ్డువెపు నడిచారు. అక్కడున్న ఆటోలో యిద్దరూ కూర్చున్నారు.

ఆటో రోడ్డుమ్మట దూసుకుపోయింది.

అంతవరకూ వాళ్ళను గమనిస్తున్న వ్యక్తి వేగంగా తన అంబాసిడర్ కారు వైపు వెళ్ళాడు. కారులో కూర్చుని తలుపుమూశాడు. కారును వేగంగా పోనిచ్చాడు. కాస్సేపట్లో ముందు వెళుతున్న ఆటో అతడికి కనిపించింది. దాని వెనకనే అతడు తన కారును పోనిచ్చాడు!

బీచ్‌లో ఆటో ఆగింది. ఇద్దరూ దిగారు. మోహన్ డబ్బు చెల్లించాడు. సోడియంవాపర్ లైట్లు ప్రకాశవంతంగా వెల్గుతున్నాయి. ఇద్దరూ లోపలకు నడిచారు. సముద్రపు హోరు వినిపిస్తోంది.

రమ పైకి చూసింది. చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. చంద్రకాంతి, చల్లగాలి అఖండగా వున్నాయి. ఆమె అతడికి దగ్గరగా జరిగి యిసుకలో నడుస్తోంది. అతడు నలువైపులా చూశాడు. ఎక్కడా సమీపంలో మనుషులు లేరు. ఆమె చుట్టూ తన చెయ్యిని పోనిచ్చాడు. ఆమెను గట్టిగా నొక్కిపట్టుకున్నాడు. ఇద్దరూ మెల్లిగా యిసుకలో కదుల్తున్నారు.

కొంచెం దూరంలో యిసుకలో వున్న ఒక పడవ ఆకారం వాళ్ళకు కనిపించింది.

“అక్కడ కూర్చుందాం!” అన్నాడు మోహన్.

“పడవలోనా?” ప్రశ్నించిందామె కొంటెగా.

అతను ఆగాడు. అమాంతంగా ఆమె పెదిమలను ముద్దెట్టుకున్నాడు. ఆమెవైపు ప్రేమతో చూశాడు.

“రమా, ఐ లవ్ యూ!” అన్నాడు మోహన్.

ఆమె మాట్లాడలేదు. మౌనంగా అతడివంక చూసింది. ఇద్దరూ మెల్లిగా కదిలారు. పడవ పక్కనే కూర్చుని సముద్రంకేసి యిద్దరూ చూశారు. కెరటాలు పొంగుతూ

ముందుకొస్తున్నాయి. ఒడ్డున పగిలి నురుగులు కక్కుతూ వెనక్కు పోతున్నాయి.

అతడామెను తనవైపు లాగాడు. నవ్వుతూ ఆమె అతడి ఒళ్ళో వెల్లకిలా పడింది.

"రమా, యిలా రాత్రంతా వుండిపోదాం. సూర్యోదయం చూసి యిళ్ళకు పోదాం," అన్నాడతను.

"ఆ పాటికి నాన్న నన్నెవరో ఎత్తుకు పోయారని పోలీసు రిపోర్టు కూడా యిచ్చేస్తాడు!" అందామె.

"ఇస్తే యివ్వనీ! ఎత్తుకుపోయింది నేనేగా!"

ఆమె ఏదో నీడను చూసి లేవబోయింది. తటాలున బలమైన చెయ్యి మోహన్ చంపమీద రాకెట్‌లా దిగింది. అతడు పక్కకు పడ్డాడు. అతడికి స్పృహ లేదు. ఆమె గాభరాగా ఎదురుగా వున్న వ్యక్తివైపు చూసింది. అమాంతంగా అరవబోయింది. కాని అతడి చెయ్యి ఆమె నోరును నొక్కేసింది. ఆమెను యిసుకలోకి తోశాడతను. ఆమె లేవడానికి శాయశక్తులా ప్రయత్నిస్తోంది. అతడి చేతిలోని ఆయుధం ఆమెను అనేకచోట్ల పొడవసాగింది. అతడు లేచాడు.

క్షణకాలం యిసుకలో పడున్న ఆమెవంక చూశాడు. వెనక్కి తిరిగి వేగంగా వెళ్ళిపోయాడు.

అరగంట తర్వాత మోహన్ మేలుకొన్నాడు. రమ కోసం యిటూ, అటూ చూశాడు. కొంచెం దూరంలో వెల్లకిలా పడున్న ఆమె ఆకారం కనిపించింది. ఆమె నిద్ర పోతూ వుండాలి! అతడు కెరటాలవైపు వెళ్ళి ముఖం కడుక్కున్నాడు. వెనక్కి తిరిగొచ్చి ఆమె పక్కనే కూర్చున్నాడు. ఆమె వైపు చూసి వులిక్కిపడ్డాడు.

ఆమె చీరమీద అనేక బొట్ల రక్తం! ఆమెను తట్టాడు.

ఆమె శరీరం చల్లగావుంది. అతడి గుండె దడదడలాడింది. తనను చంపమీద కొట్టిన వ్యక్తి ఆమెను హత్యచేశాడా! అతనెవరు? ఆమె ప్రియుడా?

అక్కడుంటే యీ హత్యలో తను యిరుక్కోవచ్చు. రమ ఈ లోకంలో లేదు. అతడు లేచాడు. వేగంగా ఇసుకలో నడుస్తూ రోడ్డువైపు వెళ్ళాడు. ఎవరేనా తన్ని చూస్తే ప్రమాదం. ఎవ్వరికీ కనపడకుండా అతడు రోడ్డు దాటాడు. పక్కరోడ్డుకు తిరిగి వడివడిగా నడిచాడు.

రెండు ఫర్లాంగులు దాటాక బస్ స్టేండ్ చూసి అతడు ఆగాడు. బస్సులో పోవడం మంచిది. టాక్సీ, ఆటో డ్రయివర్లు మనుషుల్ని గుర్తుంచుకుంటారు. బస్‌లో పోతే ఏ బెంగా వుండదు.

కాస్సేపట్లో బస్సు రాగానే అతడు యెక్కాడు. బస్ కదిలింది. అతడు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. పాపం, రమ శవం రాత్రంతా అలాగే అక్కడ పడుంటుందేమో! ఆమె శవాన్ని వాళ్ళు కనుక్కునేటట్లు తను చెయ్యాలి!

ఒకచోట అతడు దిగాడు. కొంచెం దూరం నడిచి పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లోకి దూరి తలుపు మూశాడు. రిసీవరెత్తి ఒక నంబరు తిప్పాడు. ఎవరో హలో అన్నారు. అతడు యాభై పైసలు పడేసి తన కంఠాన్ని మార్చాడు. "సార్. గాంధీ స్టాట్యూ సమీపంలో ఒక యువతి హత్య చేయబడింది. మీ అమ్మాయేమో వెళ్ళి చూడండి" అన్నాడతను.

"రామా, రామా!" అరిచిందొక కంఠం అటువైపు నుంచి.

మోహన్ మౌనంగా వుండిపోయాడు.

"మిస్టర్, ఆమె మా అమ్మాయని నీకెలా తెలుసు?"

"నేను మీ ఇంటి సమీపంలోనే వుంటున్నాను. ఆమె నాకు గుర్తు."

"మిస్టర్, నీ పేరూ, అడ్రసూ చెప్తావా?"

మోహన్ రిసీవర్ని వెంటనే పెట్టేసి బయటకు నడిచాడు. తనింటివైపు అడుగులేశాడు. రమ ఇంటికి సమీపంలో తను వుండడంలేదు. అందువలన ఎవ్వరూ తనని అనుమానించరు. కాస్సేపట్లో అతడు తనింటికి చేరుకున్నాడు.

2

గణపతిరావుతో ఫోన్లో మాట్లాడి వెంటనే దుస్తులు మార్చుకొన్నాను. మెట్లవైపు వెళ్తూండగా టెలిఫోన్ మ్రోగింది. వెళ్ళి రిసీవర్ని ఎత్తాను.

"హలో, పరశురామ్ హియర్!"

"బ్రదర్, ఇన్స్పెక్టర్ నాయర్ స్పీకింగ్, బీచ్లో ఏదో హత్య జరిగిందట. నువ్వు అక్కడికి వస్తావా?"

"వస్తున్నా" అన్నాను.

"ఈ న్యూస్ నీకు ముందే తెలుసన్న మాట!"

"గణపతిరావుగారు ఫోన్ చేశాడు. పోలీస్కి రిపోర్టివ్వమన్నాను. ఆల్ రైట్ అక్కడి కొస్తున్నానుగా, తర్వాత అంతా మాట్లాడుదాం" అని రిసీవర్ని పెట్టేశాను.

మెట్లు దిగి షెడ్ వైపు పరుగెత్తాను. మరో నిమిషంలో నా డాడ్జికారు బీచ్ వైపు దూసుకుపోయింది. చల్లటిగాలి వీస్తోంది. గాంధీ విగ్రహానికి కొంచెం దూరంగా కారును బీచ్ లోపల రోడ్డుకు పోనిచ్చాడు. క్షణకాలం ఆలోచించి ఎడంవైపుకు తిప్పి పోనిచ్చి

పోలీస్ జీప్ వెనక నే ఆపాను. జీప్ ముందు మరో కారుంది.

ఇన్‌స్పెక్టర్ నాయర్ ఒక వ్యక్తితో నా దగ్గర కొచ్చాడు. "బ్రదర్, నీకు ఫోన్ చేసిన గణపతిరావు గారు ఈయనే!" పరిచయం చేశాడు.

"పరశురామ్‌గారూ, ఆ శవం మా అమ్మాయిది కాకూడదని దేవుడిని ప్రార్థిస్తూ వచ్చాను" అన్నాడు గణపతిరావు.

"గణపతిరావుగారూ, ఆ శవం ఎవరిదైనా ఏ తల్లిదండ్రులనో ఏడిపిస్తుంది" అని నాయర్ వైపు తిరిగాను.

"నేనూ ఇప్పుడే వచ్చాను. వెళ్ళి చూద్దాం, పద" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నాయర్.

"శవం ఎక్కడుంది?"

"కానిస్టేబుల్సు వెతుకుతున్నారు" అన్నాడు నాయర్.

దూరంలో వెలుతున్న టార్చిలైట్లను గుర్తించాను. ఇంకా తొందరలేదు. శవం కనిపించాక అక్కడకు వెళ్ళొచ్చు.

ఇసుకలో నుంచుని సిగరెట్ వెలిగించాను. పొగ వదుల్తూ నలువైపులా చూశాను. చంద్రకాంతి బ్రహ్మాండంగా వుంది. ఇన్‌స్పెక్టర్ నాయర్ గణపతిరావు నా పక్కనే నిలబడ్డారు.

"ఇక్కడుంది సార్!" అర్చాడొక కానిస్టేబుల్.

దూరంలో పడవ కనిపిస్తోంది. అరుపు అటువైపు నుంచి వచ్చింది. వేగంగా అటువైపు నడిచాను. నాయర్, గణపతిరావు నాతో కూడా కదులుతున్నారు.

సముద్రపు ఒడ్డున పడవ కటువైపున యిసుకలో వెల్ల

కిలా పడివుంది శవం. టార్చి కాంతిలో శవాన్ని చూస్తున్నాను.

"ఓ భగవాన్, ఎందుకిలా చేశావు? పరశురామ్‌గారూ, ఇది నా కూతురే. పేరు రమ" అన్నాడు గణపతిరావు.

అతడు ఏడుస్తూ యిసుకలో కూలిపోయాడు. తలనుంచి పాదాల దాకా శవాన్ని చూశాను. ఆరడజను చోట్ల వలయాకారంలో మేకులతో పొడిచినట్లు స్పష్టంగా తెలుస్తోంది. హంతకుడు కత్తిని వుపయోగించి వుండడు. షార్ప్‌లాంటి ఆయుధంతో ఆమెను అనేకచోట్ల పొడిచాడు. ఒక్కపోటుకు శరీరంలో ఆరుచిల్లులు సంభవించి వుండాలి! హంతకుడు యీ ఆయుధాన్ని స్పెషల్‌గా చేయించాడేమో!

ఆమె పక్కనే హేండ్ బాగ్ పడుంది. జేబురుమాలతో పట్టుకొని దాన్ని తెర్చిచూశాను. లోపల కొంత డబ్బు మేకప్ బాక్స్, చిన్న అద్దం వగైరా వున్నాయి. ఆమె ఒంటిమీద నగలన్నీ అలాగే వున్నాయి. దొంగతనం కోసం ఈ హత్య జరిగివుండక పోవచ్చు.

రమ చాలా అందమైన యువతి. ఇంత అమానుషంగా ఆమెను యెందుకు హత్య చేయవలసి వచ్చిందో వూహాతీతంగా వుంది.

లేచి నిలబడి సిగరెట్ వెలిగించాను. గణపతిరావు యింకా ఏడుస్తున్నాడు.

"నాయర్ భాయ్, ఆయన్ని కొంచెం దూరంగా తీసుకెళ్ళడం మంచిది" అన్నాను.

ఇన్‌స్పెక్టర్ నాయర్ కానిస్టేబుల్‌తో చెప్పాడు. ఒక కానిస్టేబుల్ అతడిని లేవదీసి దూరంగా తీసుకుపోయాడు.

"రేప్ చేసి చంపాడేమో!" అన్నాడు నాయర్.

"డాక్టర్ పరీక్ష అయ్యాక అది తెలుస్తుంది" అన్నాను.

"హాస్పటల్లో డాక్టర్ సుధాకర్ వస్తారు" అన్నాడు నాయర్.

ఆలోచిస్తూ దూరంలో కూర్చున్న గణపతిరావు దగ్గరకు వెళ్ళాను. అతడి కెదురుగా యిసుకలో చతికిలబడ్డాను. అతడి చెయ్యి పట్టుకొని ఓదార్చాను.

"పరశురామ్‌గారూ, నాకు రమ ఒక్కగా నొక్క కూతురు. ఈ వార్త తెలిస్తే నా భార్య గుండె ఆగిచస్తుంది" అన్నాడతను.

"మీ అమ్మాయి బీచ్‌కి వెళ్తున్నట్టు మీతో చెప్పిందా?"

"చెప్పలేదు సార్. తన ఫ్రెండ్ కోకిల యింటికి వెళ్ళి వస్తానంది. కోకిల యింటికి ఫోన్ చేశాను. రమ అక్కడకు రానేలేదని చెప్పింది."

"ఆమె కాలేజి స్టూడెంటా?"

"ఈ సంవత్సరంలో బి.ఎ పాసయింది. పెళ్ళి సంబంధాలు చూస్తున్నాను. దాని జీవితం ఈ విధంగా అంతరిస్తుందని కలలో కూడా నేననుకోలేదు."

వెనక్కి తిరిగాను. డాక్టర్ సుధాకర్ వచ్చాడు. ఇన్‌స్పెక్టర్ నాయర్, డాక్టర్ సుధాకర్ ఏదో మాట్లాడుకుంటున్నారు.

"మీ అమ్మాయికి బాయ్‌ఫ్రెండ్స్ వున్నారా?"

"లేరు సార్."

"గణపతిరావుగారూ, ఎవ్వరూ తోడు లేకుండా ఆమె ఒంటరిగా రాత్రి బీచ్‌కి రావడం సహజంగా

లేదు. ఆమెతో మరెవరో వచ్చుండాలి!" అన్నాను.

గణపతిరావు జవాబివ్వలేదు. ఆలోచిస్తూ వుండి పోయాడు.

"ఈ వార్త టెలిఫోన్‌లో ఎవరో చెప్పారని మీరు నాతో ఫోన్‌లో అన్నారు. ఆ వ్యక్తికి యీ హత్యతో సంబంధం వుండొచ్చు. అతడు మీతో ఏం చెప్పాడో నాకు వివరంగా చెప్పండి."

"బీచ్‌లో ఎవరి శవమో పడుంది. అది మీ అమ్మాయి దేమో వెళ్ళి చూడమన్నాడతను. అతడు మా యింటి సమీపంలో వుంటున్నాడట. అమ్మాయితో పరిచయం లేకపోయినా ఆమె ముఖం అతడికి గుర్తుంది."

"అతడు గాభరాగా చెప్పాడా?"

"అతడి కంఠంలో గాభరా లేదు. కాని కంఠం సహజంగా లేదని నాకు యెందుకో అనిపించింది. కంఠం మార్చాడేమో!"

ఇన్‌స్పెక్టర్ నాయర్ నా దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు.

"బ్రదర్, ఆమె రేప్ చేయబడలేదు. డాక్టర్ సుధాకర్ ఆ విషయం గురించి నిస్సందేహంగా చెప్తున్నారు" అన్నాడు నాయర్.

"నాయర్ భాయ్, రేప్ జరగలేదు. దొంగతనం జరగలేదు. ఆశ్చర్యంగా వుంది. అయితే యీ హత్య యెందుకు జరిగిందంటావు?" ప్రశ్నించాను.

"అదే నాకూ తెలియడం లేదు!"

"డోంట్ బాదర్! ప్రస్తుతం మనకు తెలియక పోయినా ఏదో కారణం వుంటుంది. అకారణంగా ఒకడు మరొక మనిషిని చంపడు. అది మనకు త్వరలో తెలు

స్తుంది" అని లేచాను.

గణపతిరావు లేవబోయాడు. అతడిని కూర్చోమని హెచ్చరించి నేనూ, నాయర్ శవం దగ్గరకు వెళ్ళాం.

డాక్టర్ సుధాకర్ నాతో కరచాలనం చేశాడు.

"డాక్టర్, హత్యకు ఉపయోగించిన ఆయుధం ఏమిటై వుంటుంది?"

"పరశురామ్‌గారూ, యిటువంటి ఆయుధాన్ని గురించి నేనెన్నడూ వినలేదు. గుండ్రటి ఫోర్క్‌లాంటిది అయి వుండాలి! అటువంటి ఆయుధాన్ని హంతకుడు చేయించి వుండాలి!" అన్నాడు డాక్టర్ సుధాకర్.

"యూ ఆర్ రైట్, అదే నేననుకున్నాను. గుండ్రటి ప్లేటుకు అరడజన్ నీడిల్స్ అమర్చబడి వుండాలి. శరీరం లోకి పొడిస్తే అరడజన్ నీడిల్స్ వలయాకారంలో లోపలకు దిగుతాయి," అన్నాను.

మరోసారి ఆమె బాగ్‌ను పరిశీలించాను. చిన్న కాగితం ముక్క నాకు కనిపించింది. దానిమీద ఎమ్— నంబర్ 663851 అని రాసివుంది. ఆ కాగితం ముక్కను బాగ్‌లో పడేశాను.

"బ్రదర్ ఆ నెంబరేమిటి?" అడిగాడు నాయర్.

"ఏదో టెలిఫోన్ నంబర్. ఎవర్దో కనుక్కోవాలి," అన్నాను.

టైమ్ చూశాను. పదకొండు దాటింది. ఇన్స్‌పెక్టర్ నాయర్ వంక చూశాను.

"నాయర్ భాయ్, నేను వెళ్ళివస్తాను!" అని నా కారువైపు నడవసాగాను.

డాడ్జి కారును పోనిచ్చాను. రాత్రంతా తెరిచివుండే హోటల్ మిలప్ ముందు కారాపాను. అక్కడ చాలా

కార్లు వున్నాయి. హోటల్ కుర్రాడు పరుగెత్తు కొచ్చాడు.

"హాట్ టీ పట్రా!"

కాసేపట్లో హాట్ టీ తెచ్చి యిచ్చాడతను. టీ సేవిస్తూ ఆలోచించసాగాను. ఆ టెలిఫోన్ నెంబర్ ఎవరిదో! చాలా కాలంనుంచి ఆ కాగితం ముక్క ఆమె హేండ్‌బాగ్‌లో వుండివుండాలి.

మరో రెండు కప్పుల టీ తాగి, డబ్బు చెల్లించి కారును యింటివైపు పోనిచ్చాను. ఆ నంబర్ని గురించి యింత రాత్రివేళ కనుక్కోడం సాధ్యంకాదు. అదంతా తెల్లారాక చెయ్యాలి.

3

పొద్దుటొచ్చిన దినపత్రికల్లో రమ ఘోర హత్యను గురించి పత్రికా విలేఖర్లు చాలా రాశారు. రమ ఫోటో అన్ని పత్రికల్లోనూ వుంది. ఆరు కప్పుల కాఫీ తాగి, సిగరెట్ పీలుస్తూ దిన పత్రికలను చూస్తున్నాను. టెలిఫోన్ మ్రోగింది.

"హాలో!" అన్నాను.

"బ్రదర్ నువ్వు వెళ్లాక నిన్న రాత్రి ప్రెస్‌వాళ్ళు మందగా బీచ్‌కి వచ్చారు. రమ హత్యకు పబ్లిసిటీ ఎక్కువగా రావచ్చు," అన్నాడు నాయర్.

"పబ్లిసిటీ రావడం మంచిదే. ఆమె బీచ్‌కి వెళ్ళింది. ఏ టాక్సీ డ్రయివరో పబ్లిసిటీ చూసి నీ దగ్గరకొచ్చి అంతా చెప్పొచ్చు!"

"ఇంతవరకూ ఎవ్వరూ రాలేదు! రెండు ఫోన్ కాల్స్ మాత్రం వచ్చాయి. ఇద్దరు స్త్రీలు నన్ను ఎడాపెడా తిట్టేశారు—రమకు జరిగినదానికి!"

"ఇంకా చాలామంది తిట్టొచ్చు! చివాట్లకు అలవాటు పడిపోవడం నేర్చుకో!" అన్నాను నవ్వుతూ.

"బ్రదర్ బీచ్ ప్రాంతంలో కొంతమందిని రమ గురించి అడిగిచూశాను. కాని ఆమెను ఎవ్వరూ చూడ లేదు. ఆమె శవాన్ని పోస్ట్‌మార్టమ్‌కి పంపించాను. త్వరలో రపోర్టు వస్తుంది."

"గుడ్ వర్క్!"

మరికొన్ని విషయాలు మాట్లాడి రిసీవర్ని పెట్టేశాను. ఇన్‌స్పెక్టర్ నాయర్ పద్ధతుల్లో పరిశోధన సాగిస్తే ఏ హంతకుడూ పోలీసులకు దొరకడు!

టైమ్ తొమ్మిది దాటింది. ఇరవై యిడ్లీ తిని, నాలుగు కప్పుల కాఫీ సేవించాను. టెలిఫోన్ మ్రోగింది. రిసీవర్ని అందుకున్నాను.

"హలో, పరశురామ్ హియర్!"

"సార్, మీరు అడిగిన నంబర్ అరున్ అండ్ కంపెనీది. అదొక ఫాక్టరీ. విల్లివాకం ప్రాంతంలో వుంది. డైరక్టరీలో ఆ కంపెనీ అడ్రస్ మీరు చూడొచ్చు," అందామె.

ఆమెకు థాంక్స్ చెప్పి రిసీవర్ని పెట్టేశాను. అరున్ అండ్ కంపెనీ!

ఆ కంపెనీలో పనిచేసేవారెవరో రమకు తెలిసి వుంటాలి.

ఆ నంబర్‌కి ఫోన్ చేశాను. ఒక స్త్రీ అటువైపునుంచి "అరున్ అండ్ కంపెని ప్లీస్ అంది,"

"మిస్టర్ ఎమ్ కావాలి," అన్నాను క్లుప్తంగా.

"మూర్తా, మోహనా?" అడిగిందామె.

"నాకు కావలసిన ఎమ్ యువకుడు," అన్నాను.

"అయితే మిస్టర్ మోహన్ అయివుండాలి. జస్ట్ ఎ మోమెంట్," అందామె.

కాన్ఫెరెన్స్ అటువైపునుంచి ఒక పురుష కంఠం వినబడింది.

"మోహన్ స్పీకింగ్!"

"మిస్టర్ మోహన్, మీతో మాట్లాడాలి!"

"ఎవరు మీరు?"

"డిటెక్టివ్ పరుశురామ్!"

అతడు నా పేరు విని తృళ్ళిపడ్డాడు. అతడు నా కళ్ళముందు లేకపోయినా అతడి కంగార్ని నేను గ్రహించగలాను.

"నాతో మీకేం పని?" అడిగాడతను ఖంగారుగా.

"రమ!"

"ఆమె ఎవరు?"

"నీకు తెలుసుండాలి!"

"నాకు రమ ఎవరో తెలియదు సార్."

"ఇవాళ్టి పేపరు చూశావా?"

"చూశాను."

"రమ అనే యువతి హత్య గురించి చదివావా?"

"చూసాను సార్. చాలా విచారకరమైన వార్త."

"పేపర్లు ప్రచురించని వార్త నీకు చెబుతున్నాను. ఆమె హేండ్ బాగ్ లో ఒక కాగితం ముక్కమీద నీ పేరు, ఫోన్ నంబర్ రాసివున్నాయి."

"ఆశ్చర్యంగా వుంది సార్. ఆ మోహన్ మరెవరో అయివుండాలి!"

"కాని ఆ ఫోన్ నంబరు నీదే!" అన్నాను గంభీరంగా.

"ఇంతకీ మీ కేం కావాలి?"

"నేను కారులో వస్తున్నాను. డాడ్జికారు. మీ ఆఫీసు ముందు నిలబడు. నా కారు దగ్గరకు రా. మాట్లాడుదాం."

"నాకేం తెలియదంటే మీరు వినటంలేదు. మీరింత దూరం రావడం అనవసరం."

"నువ్వు చెప్పేది నిజమని తేల్చుకున్నాక నిన్ను వదిలేస్తాను. నువ్వు భయపడకు. నా మూలంగా నీకే ప్రమాదం రాదు. నాతో మాట్లాడకపోతే పోలీసులతో మాట్లాడవలసివస్తుంది. నిన్ను అరెస్టు చేసి వాళ్ళు లాకప్‌లో పడేస్తారు!"

"రండి సార్, మీ కోసం యెదురు చూస్తూ వుంటాను."

రిసీవర్ పెట్టేశాను. దుస్తులు మార్చుకున్నాను. తల దువ్వుకొంటున్న పార్వతిని ముద్దెట్టుకొని కిందకు దిగాను. వంటతను క్రిష్ణయ్య కనిపించాడు. "ఇవాళ లంచ్‌కి కందట్లు సార్" అన్నాడతను.

కందట్లను గురించి వూహించుకొంటూ కారు షెడ్ వైపు పరుగెత్తాను. డాడ్జి కారును గేటువైపు పోనిచ్చాను.

తిరువళ్ళూరు హైరోడ్డు వారగా వుందా కంపెనీ ఆఫీసు. కారును ఆపి ఇండియా కింగ్స్ సిగరెట్ వెలిగించాను. రోడ్డుదాటి ఒక యువకుడు కారువైపు వచ్చాడు.

అతడివైపు నవ్వుతూ చూశాను. వయస్సు యిరవై ఐదేళ్ళు వుంటుంది. సన్నగా, పొడుగ్గా వున్నాడు. కోల ముఖం. మనిషి పచ్చగా అందంగా వున్నాడు. పాంట్, స్లాక్ ధరించాడు. చేతికి డేట్ సెట్ వాచ్ వుంది.

అతడిని కార్లో కూర్చోమన్నాను. తిరిగొచ్చి కారులో కూర్చున్నాడు. పక్కకు తిరిగి అతడివైపు హిప్నాటిస్టులా

చూశాను. అతడి కళ్ళలో ఏదో భయం గోచరిస్తోంది.

"రమ నీకు తెలియడం వలన యీ హత్యకేసులో నువ్వు ఇరుక్కోవు. ఏ నేరం చెయ్యనంతకాలం నీకు ఏ బెంగా వుండనవసరం లేదు. నిన్ను నేను కాపాడ్తాను. నువ్వు నిజం చెప్పి నాతో సహకరిస్తే ఆ అమాయకురాలి హంతకుడిని పట్టుకొనేందుకు తోడ్పడతావు" అన్నాను శాంతంగా.

అతడు ఓ నిమిషంపాటు మాట్లాడలేదు. మౌనంగా వుండిపోయాడు. ,

"పరశురామ్‌గారూ, రమ నాకు తెలుసు. ఆమెను నేను గాఢంగా ప్రేమించాను. నిన్న నాతో ఆమె బీచ్‌కి వచ్చింది" అన్నాడతను కన్నీళ్ళు కారుస్తూ.

"అక్కడేమైంది?"

"ఇద్దరం పడవపక్కన చంద్రకాంతిలో కూర్చున్నాం. ఆమె నా ఒళ్ళో వెల్లకిలా పడుకొంది. కమ్మటి కబుర్లు చెప్పుకుంటూ ఆనందిస్తున్నాం. సమీపంలో యెవ్వరూ లేరు. అమాంతంగా ఎవరో నన్ను చంపమీద కొట్టారు. నేను స్పృహతప్పి పడిపోయాను. అటుపైన ఏం జరిగిందో నాకు తెలియదు. అరగంట తర్వాత నేను మేలుకొని ఆమెకోసం చూసాను. కొంచెం దూరంలో ఆమె పడుకొని వుంది. సముద్రపు నీళ్ళతో మొహం కడుక్కొని ఆమె పడుకున్నచోటుకు వెళ్ళాను. ఆమెమీదున్న రక్తాన్ని చూసి తారెత్తిపోయాను. నన్ను కొట్టిన వ్యక్తి ఆమెను చంపేసివుంటాడని వూహించాను. నేను ఏం చెయ్యాలి? రమ యీ లోకంలో లేదు. ఈ కేసులో ఇరుక్కోడం నాకిష్టం లేదు. ఆమెను వదిలి మెల్లిగా వెళ్ళిపోయాను."

అతడు ఆగాడు. కన్నీళ్ళు ధారలుగా కారుతున్నాయి.

"ఆమెను ఆ విధంగా వదిలేసిపోతున్నందుకు నా హృదయం నన్ను పీకుతోంది. పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుంచి ఆమె యింటికి ఫోన్ చేసి, కంఠం మార్చి ఆమె తండ్రితో యీ వార్త చెప్పాను. అటుపైన నా యింటికి పోయాను" అన్నాడు మోహన్.

"మిస్టర్ మోహన్, ఆమెను మరెవరేనా ప్రేమించారా?"

"లేదు సార్. ఎవరేనా ప్రేమించి వుంటే ఆమె నాతో తప్పక చెప్పేది."

సిగరెట్ పొగ వదులుతూ ఆలోచిస్తున్నాను.

"నీకు తగిలిన దెబ్బనుబట్టి అతడు చాలా బలమైన వాడై వుండాలి!"

"సందేహం లేదు సార్. అతడి చెయ్యి యినుముతో చేసినట్లుంది."

అతడి చంపను పరీక్షించాను. కుడివైపున చర్మం కమిలిపోయినట్లు నల్లబడివుంది.

"రమను నువ్వు కల్సుకుంటున్నట్లు ఆమె తలిదండ్రులకు తెలుసా?"

"ఎవ్వరికీ తెలియదు సార్. సరైన సమయం చూసి మా పెళ్ళి విషయం ఆమె తండ్రితో చెప్తానంది. ఆమె ధనవంతురాలు. నేను ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నాను. నా జీతం ఇంకా పెరిగితేగాని తండ్రి ఒప్పుకోరని ఆమె అనేది."

"ఎంతకాలం నుంచి ఆమె నీకు తెలుసు?"

"సంవత్సరం నుంచి. ఆమె కాలేజిలో బి. ఏ. చదువుతూ వుండేది."

"నువ్వామెను పెళ్ళాడ్తానంటే, మీ వాళ్ళు ఒప్పు

కున్నారా?"

"నాకు అమ్మ మాత్రంవుంది. నే నామెతో చెప్పాను. ఆమె వెంటనే ఒప్పుకుంది."

ఆలోచిస్తూ వుండిపోయాను. మోహన్ వైపునుంచి రమకు శత్రువులు లేరు. మరెవ్వరూ ఆమెను ప్రేమించ లేదు! ఈ హత్యకు మోటివ్ దొంగతనం కాదు. హంత కుడు ఆమెను రేప్ చేయలేదు. అందాలొలికించే ఆ పువ్వును హంతకుడు తుంచి యెందుకు మట్టిపాలు చేశాడు?

ఇది లక్షరూపాయల ప్రశ్న! జవాబిచ్చిన వ్యక్తికి లక్షరూపాయలు యివ్వొచ్చు!

"మిస్టర్ మోహన్, గత సంవత్సరంలో మీరిద్దరూ ఎన్నిసార్లో కలుసుకొనివుంటారు. ఆమె నీతో ఎన్ని విష యాలో చెప్పివుంటుంది. ఏవైనా గుర్తున్నాయా?"

"ఇప్పుడు చెప్పలేను సార్. నా మనస్సు ప్రస్తుతం బాగాలేదు."

జేబులోంచి నా కార్డుతీసి అతడికిచ్చాను.

"ఏదేనా గుర్తొస్తే నా నంబరుకు ఫోన్ చేసి చెప్పు. నేను లేకపోయినా చెప్పు. నా భార్య నీ మాటల్ని రికార్డు చేస్తుంది. నేను వచ్చాక అంతా వింటాను."

"అలాగే సార్" అన్నాడతడు.

"గుడ్ లక్" అని అతడిని కారులోంచి దిగి పోనిచ్చాను.

4

అతడు తోటలో తిరుగుతున్నాడు. చెట్లమీదున్న పక్షులు కూస్తున్నాయి. వాటివైపు కోపంగా చూస్తూ రెండు రాళ్ళను పైకి విసిరాడు. పక్షులు ఎగిరి దూరంగా పోయాయి.

అతను మెల్లిగా ముందుకు కదిలాడు. తెల్లటి కుక్క అతడి పక్కనుంచి పరుగెడుతోంది. ముందుకు దూకి దాని మెడను అమాంతంగా కుడిచేత్తో పట్టుకున్నాడతను. కుక్క మొరుగుతోంది. అతడు దాన్ని వదల్లేదు. ఎడం చేత్తో దాని మూతిని బిగించి పట్టుకున్నాడు.

కుక్క యిప్పుడు మొరగడం లేదు. మూలుగుతోంది. గజగజ కొట్టుకుంటూంది, కాళ్ళు ఆడిస్తూ. అతడు దాన్ని వదల్లేదు. జేబులోంచి పిడిబిగించి వున్న ఆయుధాన్ని పైకి తీశాడు. కింద భాగానికున్న ప్లాస్టిక్ కాప్‌ను తీసేశాడు.

పిడి కిందున్న గుండ్రటి స్టీల్ బిళ్ళకు పదునైన లావుపాటి ఆరు నీడిల్స్ అతకబడ్డాయి. వాటివైపు తృప్తికరంగా చూశాడతను.

పిడిని పట్టుకొని ఆయుధాన్ని పైకెత్తాడు. కుక్క యింకా పెనుగులాడ్తోంది. దాని కడుపులోకి తటాలున పొడిచాడు. అనేక చోట్ల అలా పొడుస్తూనే వున్నాడు. కుక్క రక్తంతో ముద్దయివుంది. దాని మూతిని అతడు వదిలేశాడు, కాని అది మొరిగే స్థితిలో లేదు.

తన ఆయుధానికి ప్లాస్టిక్ కాప్ మూసేసి అతడు దాన్ని తన జేబులో పడేసుకున్నాడు. జేబులో వున్న చాక్లెట్‌ను నోట్లో పడేసుకున్నాడు. నవ్వుతూ అతడు కుక్కవైపు చూశాడు. కుక్క ఒంటిమీద ఆరు చిల్లుల చక్రాలు! మృత్యుచక్రాలు!

అతడు యిటూ, అటూ చూశాడు. చెట్టుకింద ఖాళీ సిమెంట్ బాగ్స్ వున్నాయి. ఒక సంచిని తెచ్చి అందులో కుక్కని పడేశాడు. ఆ సంచిని తీసుకెళ్ళి కారు డిక్కీలో పెట్టాడు.

కారును పోనిచ్చాడు. అతడు ఆలోచిస్తున్నాడు. ఆ ఆయుధాన్ని అతడు కలకత్తాలో చేయించాడు. కంపెనీ వాళ్ళకు తన పేరు సుధాకర్ ముఖర్జీ అని చెప్పాడు. అతడి మెదడులో యిటువంటి ఆలోచనలన్నీ సాగుతున్నాయి.

నిర్మానుష్యంగా వున్న రోడ్డమ్మట కారు వెళుతోంది. అతడు కారును ఆపి దిగాడు. డిక్కీలోని సంచిని రోడ్డు వారగా పడేసి కారును పోనిచ్చాడు. తనింటికి చాలా దూరంలో వుందా సలం!

కారు స్పీడుగా వెళుతోంది. అతడి మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి.

ఆ కుక్క పోలీసుల దృష్టిలో పడుతుందా? లేక రాబందులు, కాకులు పీక్కుని దాన్ని తినేస్తాయా?

* * *

టెలిఫోన్ మ్రోగుతోంది. వెళ్ళి రిసీవర్ని ఎత్తాను.

"హలో, పరశురామ్!" అన్నాను.

"బ్రదర్, మా బీట్ కానిస్టేబుల్ ఒక కుక్కను చూసి మాకు రిపోర్టిచ్చాడు. ఎవరో పొడిచి, పొడిచి కుక్కను చంపారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నాయర్.

"పిచ్చికుక్కేమో?"

"మా వెటర్నరీ డాక్టర్ దాన్ని పరీక్షించాడు. దానికి రేబాస్ లేదు. అది మామూలు కుక్క. ఆ కుక్క శరీరం మీదున్న పోట్లను చూస్తే రమ శవం మీదున్న గాట్లు గుర్తుకొస్తాయి" అన్నాడు నాయర్.

"నాయర్ భాయ్!" అన్నాను ఆశ్చర్యంగా.

"బ్రదర్, ఆ కుక్క యింకా అక్కడే వుంది, మిల్స్ రోడ్డు వారగా. నువ్వు వెంటనే రా, నేను యీ

సమీపం నుంచే మీకు ఫోన్ చేస్తున్నాను."

"ఆల్ రైట్. వస్తున్నా!"

రిసీవర్ పెట్టేసి కిందకు పరుగెత్తాను. డాడ్జి కారును శరవేగంగా మిల్స్ రోడ్డువైపు పోనిచ్చాను. పోలీస్ జీప్ చూసి కారాపి దిగాను. ఇన్‌స్పెక్టర్ నాయర్ గబగబా వచ్చి నా చెయ్యి పట్టుకున్నాడు.

"అదుగో కుక్క!" అన్నాడు నాయర్.

జేబురుమాల్తో ముక్కు మూసుకుని కుక్క దగ్గరగా వెళ్ళాను. దాని ఒంటిమీదున్న చక్రాల పోట్లను చూసి నిర్ఘాంతపోయాను. సందేహంలేదు. రమను చంపినవాడే యీ కుక్కను చంపివుండాలి! ఈ సమీపంలో అతడి యిల్లు వుందేమో! ఈ ఆలోచన్ని వెంటనే నా మెదడు లోంచి తొలగించాను. హంతకుడు మూర్ఖుడే తేగాని తనింటి సమీపంలో ఈ కుక్కను పడేయడు. ఎక్కడో చంపి దూరంగా తెచ్చి యీ స్థలంలో పడేసివుంటాడు!

ఈ కుక్కని చంపడంలో హంతకుడి అర్థమేమిటి? పోలీసులు చూసేటట్లు దాన్ని రోడ్డువారగా పడేశాడు. ఈ కుక్కద్వారా హంతకుడు నాకు ఏదేనా సందేశం పంపదల్చాడా? హత్య చేయబడిన రమ యీ కుక్కతో సమానమైందని అతడు చెప్పదల్చాడా?

సిమెంట్ సంచిని పరిశీలించాను. దానిమీద ఎవరి అడ్రెసూ లేదు. వెనక్కి తిరిగి కారువైపు నడిచాను. రాబందులు ఆకాశంలో ఎగురుతున్నాయి. కాకులు అరుస్తూ పైన తిరుగుతున్నాయి.

ఇండియా కింగ్స్ సిగరెట్ వెలిగించాను. పొగ వదుల్తూ ఎదురుగా వున్న ఇన్‌స్పెక్టర్ వైపు చూశాను.

"బ్రదర్, హంతకుడు ఈ కుక్కను చంపి యిక్క

డెందుకు పడేసివుంటాడు?" అడిగాడు నాయర్.

"నాయర్ భాయ్, పోలీసులను ఏడిపించడానికి చేసి వుంటాడు. ఈ కుక్క కోసం పోలీస్ బృందంతో నువ్వు జీప్‌లో రావడం చూసి హంతకుడు పొట్ట పగిలేటట్టు నవ్వుకుంటూ వుంటాడు" అన్నాను.

"రాస్కెల్, ఐ విల్ గెట్ హిమ్!" అన్నాడు నాయర్ ఆగ్రహంతో.

"నాయర్ భాయ్, ఇదంతా చూస్తూంటే రమ హత్యతో వూరుకునేటట్లు లేడు హంతకుడు. ఇక్కడ ఈ కుక్కను పడేసినట్లు మరికొన్ని శవాలను అతడు మనకు వదలొచ్చు. పట్నం నలువైపులా పెట్రోల్ వాన్స్‌ను తిప్పుతూ వుండాలి. నిర్జన ప్రదేశాల సమీపంలో కానిస్టేబుల్సు తిరుగుతూ వుండాలి. పెద్దపార్కులు, బీచ్ లాంటి ప్రదేశాల్లో పోలీసులు గస్తీలు తిరగాలి."

"అలాగే చేయిస్తాను, బ్రదర్. మరో హత్య జరగకుండా వాడు మన చేతుల్లో చిక్కుతాడు, నీ సహాయంతో" అన్నాడు నాయర్.

"నాయర్ భాయ్ నేను డిటెక్టివ్‌ని, దేవుడిని కాను! అనేక విధాలుగా హంతకుడి కోసం ప్రయత్నాలు సాగిస్తున్నాను. ఇంకా అతడి వునికి నాకు అంతుచిక్కలేదు" అన్నాను.

"బ్రదర్, నీ మీద నాకు నమ్మకముంది. నువ్వు సాధిస్తావు!"

కారులో కూర్చుని తలుపు మూశాను. రోడ్డుమ్మట కార్లు యిటూ అటూ దూసుకుపోతున్నాయి. ఏ కార్లోనో కూర్చుని హంతకుడు మమ్మల్ని చూసి నవ్వుకుంటూ వుండొచ్చు. ఇన్‌స్పెక్టర్ నాయర్‌కి బై బై చెప్పి కారును

పోనిచ్చాను.

పోలీస్ జీప్ నా కారు వెనక నే కదిలింది. రాబందులు కిందకు దూసుకొస్తూన్న చప్పుడు వినపడ్తోంది.

5

"హాలో, పరశురామ్ స్పీకింగ్" అన్నాను.

"నేను మోహన్ సార్" అన్నాడతను.

"ఏదేనా జ్ఞాపకమొచ్చిందా?"

"కొన్ని విషయాలు గుర్తుకొచ్చాయి. రమ అత్తయ్య కొడుకు పేరు అంగీరస్. అతడు పొట్టిగా, సన్నగా వుంటాడట. రమాకంటె కొంచెం పెద్దవాడట. అతడికి రమ అంటే చాలా పిచ్చిట. ఎప్పుడూ ఆమెచుట్టూ తిరుగుతూ వుండేవాడని ఆమె చెప్పింది. అతడు వుండే వూరు ఖరగ్ పూరు."

"ఇంకా ఏదయినా వుందా చెప్పవలసింది?"

"ఒకసారి ఒక పెళ్ళికొడుకు ఆమెను చూడటానికి వచ్చాడు. అతడు ఏనుగులాంటి మనిషి. చాలా అంద విహీనంగా వున్నాడు. అతడినిచూసి ఆమె పరిహాసంగా నవ్వింది. కోపంతో అతడు వెళ్ళిపోయాడు."

"అతడి పేరూ, వూరూ తెలుసా?"

"ఆమె తండ్రికి తెలిసి వుండొచ్చు" అన్నాడు మోహన్.

"ఎనిథింగ్ మోర్?"

"ప్రస్తుతానికి ఈ రెండే, సార్.""

"ఫోన్ చేసి చెప్పినందుకు థాంక్స్. ఆనాడు బీచ్ కి మీరు ఆటోలో వెళుతున్నపుడు ఏ కారేనా, స్కూటరేనా మిమ్మల్ని వెంటాడిందా?"

"నేను చూడలేదు సార్. ఆమె పక్కనుంటే నాకు

మరేదీ కనిపించేది కాదు."

"మీరు ఆ పడవవేపు నడిచే సమయంలో బీచ్ లోపల రోడ్డుమీద మీ సమీపంలో ఏ కార్లేనా వున్నాయా?"

"ఏ కార్లూ మొదట లేవు. తర్వాత ఒక కారొచ్చి ఆగింది. కాని కార్లోంచి ఎవ్వరూ దిగలేదు" అన్నా డతను.

"అదేం కారో చెప్పగలవా?"

"నల్లటి అంబాసిడర్ కార్."

"థాంక్స్" అని రిసీవర్ని పెట్టేశాను.

గణపతిరావు నంబరు తిప్పాను.

"హలో, గణపతిరావు సార్."

"పరశురామ్ హియర్! మీ అమ్మాయిని చూడ్డానికి గతంలో కొంతమంది వచ్చి వెళ్ళారని విన్నాను. ఎంత మంది వచ్చారు?"

"ఆరుగురు పెళ్ళికొడుకులు వచ్చి చూసి వెళ్ళారు. కాని వాళ్ళు అమ్మాయికి నచ్చలేదు."

"చూడ్డానికి వచ్చిన ఒకతను చాలా అందవిహీనంగా వున్నాడని విన్నాను. అతడినిచూసి మీ అమ్మాయి నవ్విం దట. అతడి పేరేమిటి?"

"అతడి పేరు గుర్తులేదు సార్. అడ్రసూ తెలియదు. నేను మిస్ అయిన బస్ నంబర్లు నాకు గుర్తుండవు సార్"

"గుర్తుంచుకోవడం ఒక్కోసారి వుపయోగపడ్తుంది," అని రిసీవర్ని పెట్టేశాను.

ఏనుగులాంటి మనిషి! అందవిహీనుడు! అతడెవరు? తననిచూసి పరిహాసంగా నవ్వినందుకు అతడామెమీద పగ బట్టాడా? పెళ్ళిళ్ళ సందర్భంలో ఎందర్నో చూస్తూ వుంటాము. ఎందరో నచ్చరు. నచ్చకపోవడం హత్యకు

దారితీయదు!

రోజులు దొర్లిపోతున్నాయి. నా పరిశోధన మొదటి గడిలోనే వుంది. ఏదో కొత్త క్లూ దొరికితేగాని పరిశోధన ముందుకు జరగదు.

భోజనం ముగించి సోఫాలో పడుకుని అమెరికన్ పత్రికలో నా గురించి రాసిన రచనను పార్వతి చదువుతుంటే మౌనంగా వింటున్నాను. రచయిత నన్ను ఎక్కువగా పొగిడేశాడు. అదంతా వింటూంటే నాకే నవ్వొస్తోంది.

టెలిఫోన్ మ్రోగింది. వెళ్ళి రిసీవర్ని అందుకున్నాను.

"హలో, పరశురామ్ స్పీకింగ్" అన్నాను.

"బ్రదర్, హంతకుడు మళ్ళీ రాయి విసిరాడు!" అన్నాడు నాయర్.

"మరో కుక్కా?" ప్రశ్నించాను.

"ఈసారి కుక్క కాదు. మరో యువతి!"

"నువ్వు ఎక్కడున్నావు?"

"నాయుడూ పార్కులో."

"నేను వస్తున్నా" అని రిసీవర్ పెట్టేశాను.

"కాస్సేపు మీతో కూర్చుని మాట్లాడేందుకు వీలు కాదు. ఏదో పని!" అంది పార్వతి విసుగ్గా.

"మైడియర్, డిటెక్టివ్‌ల జీవితం అంతే. ఏక్షణంలో ఎక్కడనుంచి పిలుపు వస్తుందో వాళ్ళకే తెలియదు!" అన్నాను నవ్వుతూ.

పదినిమిషాల్లో నాయుడూపార్కుకు చేరుకున్నాను. చాలా విశాలమైన పార్కు. పార్కుగేటు తెరిచివుంది. కారును లోపలకు పోనిచ్చి పోలీస్‌జీపు ముందుగా ఆపాను.

ఇన్‌స్పెక్టర్ నాయర్ నా దగ్గరకు ఎవరో తన్నిన

బంతిలా వచ్చిపడ్డాడు. అతడివైపు నవ్వుతూ చూసాను. మా సమీపంలో లైట్ ప్రకాశవంతంగా వెలుగుతోంది.

"నాయర్ భాయ్, ఏమిటంత ఖంగారు పడుతున్నావు?"

"బ్రదర్, రమలాగే యీమె హత్య చేయబడింది."

"పద చూద్దాం."

కానిస్టేబుల్సు పార్కులో అనేకచోట్ల తిరుగుతూ వున్నారు. నాయర్‌తో పడమరవైపుకు వెళ్ళాను. సిమెంట్ సోఫాముందు గడ్డి నేలమీద ఆమె వెల్లకిలా పడివుంది. ఆమె ధరించిన తెల్లచీర రక్తమయంగా వుంది. ఆమెను కసితో హంతకుడు పదిచోట్ల పొడిచాడు. పది మృత్యుచక్రాలు! ప్రతి చక్రానికీ ఆరు చిల్లులు!

ఆమె వయసు ఇరవైలోపున వుంటుంది. ఆమె అంత అందమయినది కాదు. ఆమె ఒంటిమీద నగలున్నాయి. జాకెట్ లోపల దాచిన చిన్నపర్సులో రెండు రూపాయలు, కొంత చిల్లరవుంది. ఆమె మధ్యతరగతి కుటుంబానికి చెందినదై వుండాలి.

టైమ్ చూశాను. పదకొండు కావస్తోంది. నాయర్ వేపు చూశాను.

"ఈమె ఎవరో తెలిసిందా?"

"లేదు."

"ఈ పార్కుకి వాచ్‌మన్ వుండాలిగా?"

"అతడే," అని నాయర్ దూరంలో నిలబడిన ఒక మనిషివైపు చూపించాడు.

అతడి దగ్గరకు వెళ్ళాను. పొట్టిగా, లావుగా వున్నాడు. ఖాకీ నిక్కర్, షాకు వేసుకొన్నాడు.

"వాచ్‌మన్ నువ్వేనా?"

అతడు తలాడించాడు.

"ఆమె తరచు యీ పార్కుకు వస్తూ వుంటుందా?"

"ఆమెను చాలాసార్లు చూశాను సార్."

"ఈ పార్కును ఎన్నింటికి మూసేస్తారు?"

"మునుపు పదింటికి మూసేవాళ్ళం సార్. టి. వి. వచ్చాక 10-15కి మూస్తున్నాను."

"మూసేముందు పార్కులో ఎవ్వరూ లేకుండా చూస్తావా?"

"ఒక్కోసారి చూస్తాను, సార్. ఒక్కోసారి చూడటానికి వీలుపడదు. లోపల ఎవరేనా వుంటే ఏ గోడో దూకి వాళ్ళే పోతారు" అన్నాడతను.

"ఆమె ఇల్లెక్కడో తెలుసా?"

"తెలియదు సార్. ఈ చుట్టుపక్కలనే వుంటుంది. దూరంగా వుండేవాళ్ళు యింతసేపు యిక్కడ కూర్చోరు" అన్నాడు వాచ్‌మన్.

ఇన్‌స్పెక్టర్ నాయర్ నా దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు. అతడి వెనకనే పంచె, చొక్కా వేసుకున్న వ్యక్తి మాకు దగ్గరయ్యాడు.

"బ్రదర్, ఈయన పేరు రఘుపతి. ఈయన ఆ శవాన్ని పోల్చారు. ఆమె ఈయన కూతురు. పేరు కమల," అన్నాడు నాయర్.

రఘుపతి వంక సూటిగా చూశాను.

"మీరు యిక్కడికి ఎలా వచ్చారు?" అడిగాను.

"అమ్మాయి యింటికి రాలేదు. ఆమె కోసం వెతుకుతూ యిలా వచ్చాను. ఏదో శవం వుందని తెలిసి వెళ్ళి చూశాను. నా కూతుర్ని యెవరో ఘోరంగా హత్య చేశారు" అన్నాడతను.

"ఆమె ఈ పార్కుకి ఒంటరిగా వస్తూవుంటుందా?"

"ఒంటరిగా వస్తుంది, వాడి కోసం!"

"ఎవరికోసం?"

"పరశురామ్‌గారూ, నా కూతురు యిక తిరిగిరాదు. మీకు ఏదీ దాచకుండా నిజం చెపాను. ఆమెను యెవరు హత్య చేశారో మీరు కనుక్కుంటే నా మనసుకు కొంత శాంతి చేకూరుతుంది."

"చెప్పండి!"

"ఆమెకోసం ఎన్ని సంబంధాలో తెచ్చాను. ఆమె అందర్నీ తిరిమేసింది. ఈ రోజుల్లో ఆడపిల్ల పెళ్ళి చేయడము ఎంత కష్టమో తమరికి తెలిసేవుంటుంది. నాకు ఆరుగురు ఆడపిల్లలు, నలుగురు మగపిల్లలు. ఈమె అందరికంటె పెద్దది. బి. ఎ. పాసయ్యింది. చదువే దాన్ని పాడుచేసింది. పెళ్ళికాకుండా ఎంతకాలం అలా పడి వుండగలదు? ఓ బస్ కండక్టరుతో ఈమెకు స్నేహమయింది. అతడిని నేను ఇంటికి రానివ్వనన్నాను. వాడి కోసం యిక్కడికొచ్చి కూర్చుంటూ వుంటుంది. ఇది మంచిది కాదని నేనన్నా ఆమె వినదు" అన్నాడతను.

"ఆ కండక్టర్ పేరు?"

"దేవరాజ్."

"అతడామెను పెళ్ళాడ్తానన్నాడా?"

"అదే వాళ్ళ వుద్దేశం. బి. ఎ. పాసయిన యువతి బస్ కండక్టర్‌కి సరస్వతీదేవిలా అగుపిస్తుంది."

"వాళ్ళెందుకు పెళ్ళి చేసుకోలేదు?"

"డబ్బు పోగుచేశాక చేసుకుంటారని విన్నాను. నేను ఈ పెళ్ళి చెయ్యనన్నాను. కావలిస్తే వాళ్ళే చేసుకుంటారని వదిలేశాను."

"ఇంతకుముందు మీరు తెచ్చిన సంబంధాలేవీ ఆమెకు నచ్చలేదా?"

"శని నెత్తిమీద కూర్చునివుంటే ఎలా నచ్చుతాయి సార్? నేను తెచ్చినవాటిలో ఒకతను చాలా ధనవంతుడు. అతడికి కారూ, పెద్దయిల్లు అన్నీ వున్నాయి. మనిషి అంత అందంగా వుండడులెండి."

"అతడిలో లోపం ఏమిటి?"

"అతడి పైపెదిమలో తొర్రివుంది. నల్లగా వుంటాడు. అయినా మనిషి బలశాలి. పెద్దమనిషి. అతడిని యెడా పెడా తిట్టి పొమ్మంది కమల. కోపాన్ని దిగమింగుకుంటూ అతడు వెళ్ళిపోయాడు!"

అతడు చెప్పింది విని ఆశ్చర్యపోయాను. రమ ఇంటికి పెళ్ళిచూపులకు వెళ్ళినతను కమల ఇంటికికూడా వెళ్ళాడు. రమ, కమలా అతడిని తిరస్కరించారు. ఇద్దరూ ఘోరంగా చంపబడ్డారు!

రఘుపతివంక చూశాను.

"ఆ పెళ్ళికొడుకు పేరేమిటి?"

"సుందరం."

"అతడెక్కడుంటున్నాడో తెలుసా?"

"అతను ఈ పట్నంవాడు కాదు. విజయవాడ నివాసి. వాళ్ళ స్వంత యిల్లు గవర్నర్ పేటలో వుందన్నాడు."

"అతడు విజయవాడనుంచి యిక్కడకు కారులో వచ్చాడా?"

"వచ్చుండాలి."

"ఆ కారునంబర్ మీకు గుర్తుందా?"

"ఉంది. టి. ఎస్. ఎం. 36465."

"అంతబాగా ఎలా గుర్తుంది?"

"అతడికి మా యిల్లు తెలియదు. కారులో పాండీ బజారుకు వచ్చి వుంటానని అతడన్నాడు ఫోన్‌లో. ఎవ ర్నైనా అక్కడకు పంపమని తన కారు నంబరు చెప్పాడు. నేనే వెళ్ళి కారు నంబరు చూసి, అతడిని యింటికి తీసుకు వచ్చాను."

"అది అంబాసిడార్ కారా?"

"కారు పేరు నాకు తెలియదు సార్. కారుమాత్రం విశాలంగా వుంది. సుఖంగా కూర్చోవచ్చు."

అతడివైపు సూటిగా చూశాను.

"అతడిని మరికొంచెం వర్ణించండి," అన్నాను.

"అతడు ఆరడుగుల పైన పొడుగుంటాడు. అతడిని చూస్తే భయమేస్తుంది. కనుబొమ్మలు రెండూ కలిసి వుంటాయి. కుడిచెవి ప్రక్కన పెద్ద వులిపిరికాయ వుంటుంది. పై పెదవి మధ్యలో చీలివుంటుంది."

ఇన్‌స్పెక్టర్ నాయర్ వేపు తిరిగాను.

"నాయర్ భాయ్, నీపని కానీ. వెంటనే హంతకుడు మనకు దొరక్కపోవచ్చు. త్వరలో దొరుకుతాడు," అన్నాను.

ఇన్‌స్పెక్టర్ నాయర్, నేనూ శవం దగ్గరకు వెళ్ళాం. డాక్టర్ సుధాకర్ శవాన్ని పరీక్షిస్తున్నాడు.

"మిస్టర్ పరశురామ్, ఈసారి హంతకుడు ఈమెను రేప్ చేసి తర్వాత హతమార్చాడు" అన్నాడు డాక్టర్ సుధాకర్.

"రియల్లీ!" అన్నాను ఆశ్చర్యంగా.

"నిస్సందేహంగా" అన్నాడు డాక్టర్.

క్షణకాలం అటూయిటూ పచార్లుచేస్తూ ఆలోచించ సాగాను. రమా ఈమెకంటే చాలా అందమయినది.

ఆమెను రేప్ చేయని హంతకుడు ఈమెని యెందుకు రేప్ చేశాడు? వాళ్ళు అతడిని తిరస్కరించారు—వాళ్ళమీద విశేషమయిన అసహ్యాన్ని అతడు సృష్టించుకున్నాడు. అటువంటి స్థితిలో వాళ్ళను రేప్ చేయడు. డాక్టర్ సుధాకర్ చెప్పింది దీనికి విరుద్ధంగా వుంది.

ఆలోచిస్తూ వాచ్ మన్ దగ్గరకు వెళ్ళాను.

"ఈరాత్రి ఆమె పార్కులో కూర్చునివుండగా నువ్వు చూశావా?"

"చూశాను సార్."

"ఆమె ఒంటరిగా వుందా?"

"బస్ కండక్టర్‌తో ఆమె కూర్చుంది."

నాకు కావలసిన జవాబు అదే. ఇప్పుడు అంతా స్పష్టంగా వుంది. బస్ కండక్టర్ దేవరాజ్ చీకట్లో ఏ మూలో ఆమెను అనుభవించి వుంటాడు. అతడు వెళ్ళిపోయాక ఈ హత్య జరిగివుండాలి!

వెనక్కి తిరిగాను. ఇన్ స్పెక్టర్ నాయర్ దగ్గరకు వెళ్ళాను. ఇద్దరం నా కారువేపు నడిచాం.

"నాయర్ భాయ్, అనేక విషయాలు తెలిశాయి. హంతకుడు త్వరలో నీకు చిక్కుతాడు" అన్నాను.

"ఏదో తొందరగా జరగాలి బ్రదర్. కాస్సేపట్లో కావల్లా పత్రికల వాళ్ళు యిక్కడికొస్తారు. పోలీసు డిపార్టుమెంటు నిద్రపోతోందని ప్రజలు నిందిస్తారు" అన్నాడు నాయర్.

"ప్రస్తుతం మనం ఏమీ చెయ్యలేం. కొంతకాలం పాటు ప్రజలు ఎంత దూషించినా మనం భరించాలి. ప్రజల ఆగ్రహం శాశ్వతం కాదు. ఇందిరాగాంధీని కిందకు లాగినవాళ్ళే మళ్ళా ఆమెను సింహాసనం ఎక్కిం

చారు. హంతకుడు మనకు చిక్కాక, అంతా మర్చిపోయి ప్రజలు శెభాష్ అంటారు."

తలుపు తెరిచి కార్లో కూర్చున్నాను. ప్రెస్ వాన్ లోపలకు వస్తోంది. ఇన్స్పెక్టర్ నాయర్ శవంవైపు పరుగెత్తాడు. నేను డాడ్జికారును వేగంగా ముందుకు పోనిచ్చాను.

"మిస్టర్ పరశురామ్! పరశురామ్!" అర్చారు కొందరు విలేఖర్లు.

కారు స్పీడు హెచ్చించాను.

6

టైమ్ చూశాను—పదకొండు కావస్తోంది. మగ్లో వున్న బీర్ తాగి సిగరెట్ వెలిగించాను. జర్మనీ బీర్ అఖండంగా వుంది.

టెలిఫోన్ మ్రోగింది. రిసీవర్ని ఎత్తాను. ఎస్. టి. డి. కాల్ ఫ్రమ్ విజయవాడ. ఇన్స్పెక్టర్ కొండలరావు అటువైపు నున్నాడు.

"పరశురామ్గారూ, గవర్నర్ పేటలో మీరు అడిగిన సుందరం అనే వ్యక్తి లేడు. అతడి కిక్కడ స్వంత యిల్లు వుండడం కల్ల. ఆ వ్యక్తి మీతో అబద్ధం చెప్పి వుండాలి," అన్నాడు కొండలరావు.

"థాంక్స్ ఫర్ ది యిన్ఫర్మేషన్," అన్నాను.

రిసీవర్ పెట్టేశాను. సోఫాలో కూర్చుని మళ్ళీ బీర్ తాగడంలో నిమగ్నుడనయ్యాను. టెలిఫోన్ మళ్ళీ మ్రోగింది.

"హలో, పరశురామ్ హియర్!"

"నేను, సార్, సెల్వమ్ ఫ్రమ్ ట్రాఫిక్ అండ్ లైసెన్సింగ్!"

"చెప్పండి, మిస్టర్ సెల్వం."

"మీరు పొరబడ్డారు. ఆ కారు సుందరం అనే వ్యక్తిది కాదు. ఆ కారు ఓనర్ పేరు పి. నాగరాజు. అతను నెంబర్ 10, దేవర్ స్ట్రీట్, మైలాపూర్‌లో నివసిస్తున్నాడు."

"చాలా థాంక్స్, మిస్టర్ సెల్వం."

"మీకేం కావలసినా క్షణంలో సమాచారం అందజేస్తాను, సార్. వుంటాను," అని అతడు రిసీవర్ని పెట్టేశాడు.

సోఫాలో కూర్చున్నాను. కథ అడ్డం తిరిగింది. నాగరాజు ఎవరు? అతడే సుందరమా? వెళ్ళి రహస్యంగా చూడాలి!

మగ్‌లో వున్న బీర్‌ను పూర్తిగా తాగేశాను. ఇండియా కింగ్స్ సిగరెట్ వెలిగించాను. పొగ పీల్చి వదులుతూ కాస్సేపు ఆలోచించాను.

గబ-గబా మెట్లు దిగాను. డాడ్జికారును దేవర్ స్ట్రీట్ వైపు పోనిచ్చాను. 10 నంబరున్న గేటు వైపు చూశాను. గేటుముందు వాచ్‌మన్ వున్నాడు. కొంచెం దూరం పోనిచ్చి కారును ఆపాను.

పెద్ద మేడ లోపలుంది. ఇంటి నలువైపులా పెద్ద తోటవుంది. ఇంటి చుట్టూ ఐదడుగుల ఎత్తున ప్రహారీ గోడ వుంది. కారును వెనక్కు తిప్పి పోనిచ్చాను. పదో నంబర్ గేటుముందు కారాపి వాచ్‌మన్‌కి సౌజ్ఞ చేశాను. గూర్ఖా దగ్గరగా వచ్చాడు.

"సాబ్ యింట్లో వున్నారా?" ప్రశ్నించాను.

"లేరు, సార్," అన్నాడతను.

కారును పోనిచ్చాను. ఫర్లాంగు దూరం వెళ్ళాక ఒక

చెట్టుకింద కారాపి కూర్చున్నాను. సిగరెట్ తర్వాత సిగరెట్ పీలుస్తున్నాను. నిమిషాలు గడుస్తున్నాయి. అరగంట తర్వాత నల్లటి అంబాసిడర్ కారు రోడ్డమ్మట దూసుకు పోయింది.

కారు నడుపుతున్న వ్యక్తివైపు చూశాను. సందేహం లేదు! సుందరం వురఫ్ నాగరాజు అతనే! వెనక్కి తిరిగి చూశాను. గూర్ఖా గేటు తెరిచాక కారు లోపలకు దూసుకు పోయింది.

డాడ్జికారును శరవేగంగా యింటికి పోనిచ్చాను. ఇంటి ముందు కారాపి దిగాను. మెట్లెక్కి హాల్లోకెళ్లాను.మగ్ నిండా బీరుపోశాను. సగంపైన తాగేశాను.

రిసీవర్ ఎత్తి ఒక నంబర్ తిప్పాను.

"హలో, ఇన్స్పెక్టర్ నాయర్!"

"నాయర్ భాయ్, ఇవాళ హంతకుడిని స్వయంగా చూశాను."

"ఎక్కడ?"

"అతడి యింటి ప్రాంతంలో."

"బ్రదర్, అడ్రెస్ చెప్పు! వెంటనే అతడిని అరస్టు చేస్తాను," అన్నాడు నాయర్ హుషారుగా.

"నాయర్ భాయ్, మరికొంతకాలం ఓపిగ్గా కూర్చో! హంతకుడు నీ దగ్గరకొస్తాడు."

"అదెలా సాధ్యం బ్రదర్? ఏ దోషీ పోలీసుల దగ్గరకు రాడు. మాకు దూరంగా పరుగెడ్తాడు!"

"నాయర్ భాయ్, నా మాటల్ని నువ్వు సరిగ్గా అర్థంచేసుకోలేదు. హంతకుడు మనదగ్గరకు రాకపోవచ్చు కాని మనం అతడి దగ్గరకు వెళ్దాం. పారిపోయే అవకాశం అతడికుండదు! ఎలకలా మనకు చిక్కిపోతాడు."

"ఆ రోజు కోసం ఎదురుచూస్తూ చూస్తుంటాను," అన్నాడు ఇన్స్పెక్టర్.

*　　*　　*

ఆకాశంలో చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. ఇసుకలో రేవతి, సుధాకర్ ఎదురెదురుగా కూర్చుని వున్నారు. సమీపంలో ఎవ్వరూ లేరు. సముద్ర కెరటాల హోరు వాళ్ళకు వినిపిస్తోంది.

"రేవతీ, గుడ్ న్యూస్! నీ గురించి మా అమ్మతో చెప్పాను. ఆమె మన పెళ్ళికి ఒప్పుకుంది. నిన్ను రేపు సాయంత్రం మా యింటికి తీసుకువెళ్తాను," అన్నాడతను.

ఆమె ఆనందంగా అతడి చెయ్యి పట్టుకుని నిమిరింది.

"ఈ వార్త విని అమ్మా, నాన్నా సంతోషిస్తారు," అందామె.

"నువ్వు సంతోషించవా?" అడిగాడతను కొంటెగా.

"నా సంతోషాన్ని నీకు అందిస్తాను," అందామె.

ఏదో ఆకారం వాళ్ళవైపు కదుల్తోంది. రేవతి, సుధాకర్ కూర్చున్న స్థలానికి కొంచెం దూరంలో ఒక పడవ వుంది. వాళ్ళ పక్కనుంచి ఆ ఆకారం ముందుకు వెళ్ళి, తటాలున వెనక్కి తిరిగింది.

గాభరాపడ్తూ సుధాకర్ లేచాడు. సుధాకర్ వైపు దూకిందా ఆకారం.

పడవలోంచి బయటకు దూకాను. రాకెట్‌లా వాళ్ళ వైపు పరుగెత్తాను. సుధాకర్ కిందపడి మూలుగుతున్నాడు. రేవతిని బలంగా తోసిందా ఆకారం. ఆమె యిసుకలో పడింది. ఆమె మీదకు ఆకారం దూకింది.

"నన్ను వదులు!" అరుస్తోందామె.

"నా చేతుల్లో పడ్డవాళ్ళకు విముక్తి లభించదు!"

అందా ఆకారం.

"ఎవరు నువ్వు? నీకేం కావాలి?"

"నువ్వు తిరస్కరించిన మనిషిని!" అని అతడు చెయ్యి పైకి ఎత్తాడు.

అతడి వెనకనుంచి మెల్లిగా జరిగాను. కిందకు దిగబోయిన అతడి చెయ్యిని మెలితిప్పాను. చేతిలోని ఆయుధం యిసుకలో పడింది.

పాములా బుసకొడుతూ అతడు లేచాడు. బూట్‌తో అతడి పొట్టలో తన్నాను. అతడు యిసుకలో పడ్డాడు. అతడి కాళ్ళను పైకెత్తి పట్టుకుని గిర్రున తిప్పాను.

"రాస్కెల్!" అర్చాను.

అతడు లేవడానికి ప్రయత్నిస్తున్నాడు. కాళ్ళు నా చేతుల్లో వుండడం వలన లేవలేకపోతున్నాడు.

మెల్లిగా యీలవేశాను. పడవలోంచి ఇన్‌స్పెక్టర్ నాయర్, అరడజన్‌మంది కానిస్టేబుల్స్ నావైపు పరుగెత్తుకొచ్చారు. అతడికాళ్ళను వదిలేశాను. కానిస్టేబుల్స్ అతడిని చుట్టేశారు. ఇన్స్‌పెక్టర్ నాయర్ అతడి చేతులకు సంకెళ్ళు వేశాడు.

అతడు ఇసుకలో కూర్చుని వున్నాడు. మూలుగుతున్న సుధాకర్ లేచి రేవతి సహాయంతో నా దగ్గరకొచ్చాడు. ఇసుకలో కూర్చున్న వ్యక్తి మీద టార్చి కాంతి పడింది.

"నువ్వా!" అర్చింది రేవతి.

"ఇతడు నీకు తెలుసా?" ఆమెను అడిగాను.

"పెళ్ళి చూపులకు మా యింటికొచ్చాడు. అతడిని యిలా చూసి వెంట నే లోపలకు పరుగెత్తాను," అందామె.

"మిస్టర్ నాగరాజు, యింకా యిలా ఎంతమందిని చంపాలని నీ ఆశ?" అడిగాను.

"నన్ను తిరస్కరించిన వాళ్ళందర్నీ!" అన్నాడతను.

"కాని యిటువైన చంపే అవకాశం నీకు రాదు!"

"రాకపోతే పోనీ! ఈ వికృత రూపంతో బ్రతకడం కంటె చావడం మేలు," అన్నాడతను.

ఇన్స్పెక్టర్ నాయర్ యిసుకలో పడున్న ఆయుధాన్ని జేబురుమాలో పట్టుకుని నాకు చూపించాడు. పొడుగాటి పదునైన ఆరు స్టీల్ నీడిల్స్ టార్చి కాంతిలో మెరుస్తున్నాయి.

"అతడిని జీప్‌లో కూర్చోబెట్టండి," అన్నాను.

కానిస్టేబుల్స్ అతడిని లాక్కుపోయారు.

"దేవుడిలా వచ్చి మీరు మమ్మల్ని రక్షించారు," అంది రేవతి.

"రేవతీ, యూ ఆర్ లక్కీ! సుధాకర్ యూ ఆస్ లక్కీ! మీరిద్దరూ పెళ్ళాడి సుఖంగా జీవించాలని నా ప్రార్థన," అన్నాను.

అందరం దూరంలో వున్న కార్ల వైపు నడిచాం.

ఇన్స్పెక్టర్ నాయర్ నాతో కరచాలనం చేశాడు.

"థాంక్స్, బ్రదర్. అనుకున్నకంటె త్వరగా హంతకుడు దొరికాడు. ప్రెస్ విలేఖర్లను పిలిచి అంతా చెప్తాను," అన్నాను.

"గుడ్ లక్," అన్నాను.

ఇన్స్పెక్టర్ జీప్ వైపు వెళ్ళిపోయాడు. రేవతినీ, సుధాకర్ని నా కారులో ఎక్కమన్నాను. ఇద్దరూ ముందు సీటుమీద కూర్చున్నారు. పోలీస్ జీప్ కదిలింది. వెనకనే అంబాసిడర్ కారు వెళుతూంది.

డాడ్జికారును పోనిచ్చాను. నా పక్కనే సుధాకర్ వున్నాడు.

"మీరు ఎక్కడికి వెళ్ళాలి?" అడిగాను.

"అజంతా హోటల్ దగ్గర దిగిపోతాం." అన్నాడతను.

"మమ్మల్ని కాపాడిన మీ పేరు చెప్తే చాలా సంతోషిస్తాం," అంది రేవతి.

"తొందరపడకండి. మీరు కారు దిగాక చెప్తాను," అని స్పీడు హెచ్చించాను.

—: ఐపోయింది :—